సాక్షి అనకాపల్లి

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



ప్రభుత్వ భూమి కబ్జా

బుచ్చెయ్యపేట మండలంలోని ఆర్.భీమవరం గ్రామంలో సుమారు 110 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. 8లో



శేష వాహనంపై అప్పన్న తిరువీధి

సింహాచలం: అప్పన్న కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి శేషవాహనంపై తిరువీధి నిర్వహించారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది.

ఉష్ణోగ్రతలు

వాతావరణం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	35.5/24.3
చోడవరం	:	35.0/26.0

న్యూస్‌రీల్

ఉద్యోగ మేళా క్యాలెండర్ ఆవిష్కరణ



ఉద్యోగ మేళా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో గల ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకు రెండు ఉద్యోగ మేళాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ 2025–26 సంవత్సరానికి రూపొందించిన ఉద్యోగ మేళా వార్షిక క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ల సమావేశంలో ఈమేరకు సీఎం ఆదేశించారని చెప్పారు. క్యాలెండర్‌ను అనుసరించి ఉద్యోగ మేళాలు నిర్వహించాలన్నారు.

14న అంబేడ్కర్ జయంత్యుత్సవం

ఈ నెల 14న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా చేపడుతున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. అనకాపల్లి పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహానికి సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని, అనంతరం స్థానిక ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ కాంప్లెక్స్‌లో జయంత్యుత్సవ సభ నిర్వహిస్తామన్నారు.

అడుగంటుతున్న పెద్దేరు



మాడుగుల: పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో లేకపోవడంతో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 134 మీటర్లకు తగ్గిపోయింది. గత ఏడాది ఇదే సమయానికి 135 మీటర్లు ఉంది. వర్షాలు అనుకూలించకపోతే ఖరీఫ్‌లో చెరకు, వరి, నువ్వు చేలకు ఇబ్బందిగా ఉంటుందని పెద్దేరు జలాశయం ఆయకట్టు రైతులు చెబుతున్నారు. జలాశయం ఖరీఫ్ ఆయకట్టు 15 వేల ఎకరాలు కాగా ప్రస్తుతం 10 వేల ఎకరాల్లో సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. పంట కాలువలకు మరమ్మతులు చేపడతామని రబీ వరి సాగుకు సాగునీరు విడుదల చేయలేదు. వ్యవసాయ మోటార్ల వద్ద అక్కడక్కడ రబీ వరి చేలు సాగు చేసుకున్నారు. కానీ పెద్దేరు జలాశయం పంట కాలువ మరమ్మతు పనులు నేటికీ ప్రారంభించకపోవడంతో రైతులు అసంతృప్తితో ఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంట కాలువ పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.


రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



వెంకటరమణ (ఫైల్)

పద్మనాభం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన పద్మనాభం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వానపల్లి వెంకటరమణ(60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈయన ఎస్.రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విశాఖపట్నంలో పదో తరగతి మూల్యాంకనానికి వెళ్లి సాయంత్రం పద్మనాభంలోని తన ఇంటికి వచ్చాడు. అనంతరం సొంత పని మీద ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో రామనారాయణపురం సమీపంలో వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణకు తీవ్ర గాయాలు కాగా విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. వెంకటరమణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఎంబీఏ, కుమార్తె పీజీ పూర్తి చేశారు. వెంకటరమణ మృతిపై ఉపాధ్యాయ సంఘాల నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హడలెత్తించిన గిరి నాగు



దేవరాపల్లి: నాగయ్యపేట, వేపాడ మండలం కొప్పలవానిపాలెం సరిహద్దు పంట పొలాల్లో భారీ గిరి నాగు బుధవారం స్థానిక రైతులను హడలెత్తించింది. నాగయ్యపేట గ్రామానికి చెందిన కొమ్మినేని కృష్ణ, సన్యాసినాయుడు పొలాల్లోకి గిరి నాగు చొరబడుతుండగా స్థానిక రైతుల కంట పడింది. సుమారు 12 అడుగుల పొడవున్న గిరి నాగును చూసిన స్థానిక రైతులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. సమీప కొప్పవానిపాలేనికి చెందిన స్నేక్ క్యాచర్ కృష్ణకు స్థానికులు సమాచారం అందించారు. అరగంటకు పైగా శ్రమించి గిరినాగును అతి కష్టం మీద పట్టుకున్నారు. పట్టుకున్న గిరినాగును అటవీ అధికారుల సమక్షంలో దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టినట్లు స్నేక్ క్యాచర్ కృష్ణ తెలిపారు.

- రేబాక అల్లుమియ్యపాలెం రహదారిపై 'కూటమి' అసత్య ప్రచారం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.8 కోట్లు మంజూరు
- 11 కి.మీ. తారురోడ్డు నిర్మాణంలో సగం ఆనాడే పూర్తి
- మిగతా సగం పూర్తి చేసి గొప్పలు చెప్పకుంటున్న ప్రస్తుత సర్కారు

ఈ రోడ్డు వారే వేశారట..

సొమ్మొకడిది.. సోకొకడిది అన్న చందంగా ఉంది కూటమి నేతల ప్రచార కండూతి. అధికారంలోకి వచ్చాక ఒక్క గ్రామానికి కూడా సరైన రోడ్డు సదుపాయం కల్పించకపోగా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఘనతను సైతం తన ఖాతాలో వేసుకునేందుకు కూటమి ప్రభుత్వం ఏమాత్రం సిగ్గుపడడం లేదు. పక్కనున్న దృశ్యాలు చూడండి.. రేబాక నుంచి అల్లుమియ్యపాలెం వరకు 11.6 కి.మీ.మేర మెటల్ రోడ్డు వేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించింది. గత ఏడాది మార్చిలో పనులు ప్రారంభించారు. ఆనాడే కల్వర్టులు నిర్మించి 5 కి.మీ. మేర రోడ్డు పూర్తి చేశారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల తర్వాత మిగతా పనులను చేపట్టి.. అదంతా తమ ఘనతేనంటూ నిస్సిగ్గుగా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు కూటమి నేతలు. కానీ వాస్తవాలు దాచేస్తే దాగిపోతాయా.. జరిగిన మేలును ప్రజలు అంత తొందరగా మరచిపోతారా..!

–నక్కపల్లి



గత ఏడాది మార్చిలో రోడ్డు పనులను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభిస్తున్న రేబాక, సీతంపాలెం ప్రజాప్రతినిధులు



గత ప్రభుత్వ హయాంలోనే నిర్మించిన కల్వర్టు

గిరిజన గ్రామాల కష్టాలను తొలగించి పూర్తి స్థాయిలో రహదారి సమస్య పరిష్కరించేందుకు గత ప్రభుత్వం నక్కపల్లి మండలం రేబాక నుంచి కోటవురట్ల మండలం అల్లుమియ్యపాలెం వరకు 11 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ సమస్యను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి వెంటనే నిధులు మంజూరు చేశారు. సీతంపాలెం నుంచి రేబాక తిరుపతిపాలెం మీదుగా కోటవురట్ల మండలం అల్లుమియ్యపాలెం వరకు మట్టి రోడ్డు ఉంది. నక్కపల్లి మండల ప్రజలు కోటవురట్ల, నర్సీపట్నం వెళ్లాలంటే సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణించి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. రేబాక నుంచి ఉద్దండపురం వచ్చి అక్కడ నుంచి అడ్డురోడ్డు మీదుగా కోటవురట్ల వెళ్లాలి. అలాగే సీతంపాలెం ప్రజలు నక్కపల్లి చేరుకుని అడ్డురోడ్డు మీదుగా కోటవురట్ల మండలంలో గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేది. మట్టిరోడ్డుపై అనేక వ్యయప్రయాసలు పడి రాకపోకలు సాగించేవారు. ఈ సమస్యను గుర్తించిన స్థానిక నాయకులు సీతంపాలెం నుంచి రేబాక తిరుపతిపాలెం మీదుగా అల్లుమియ్యపాలెం గిరిజన గ్రామం వరకు 11.6 కిలోమీటర్ల దూరం కలిగిన తారురోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.8 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేయించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కోటవురట్ల, నక్కపల్లి మండలాల మధ్య 20 కి.మీ. దూరం తగ్గుతుంది. ఈ మార్గంలో ఉన్న మామిడి, జీడి తోటల్లో పండించిన ఉత్పత్తులను గిరిజనులు మార్కెటింగ్ చేసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. రైతులకు రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయి. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఏడాది క్రితమే రోడ్డు పనులకు పనులకు శంకుస్థాపన జరిగింది. రహదారి మధ్యలో బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రావెల్, మెటల్ వేసి రోడ్డు పనులను గత ప్రభుత్వంలోనే సగం వరకు పూర్తిచేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలల క్రితమే పనులు పునఃప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు పనులు పూర్తి చేసే ప్రక్రియ మొదలు పెట్టగా.. ఈ రోడ్డుకు కూటమి ప్రభుత్వంలోనే నిధులు మంజూరయ్యాయని, మంత్రి అనిత చొరవతోనే ఇది సాధ్యమయ్యిందంటూ కొంతమంది కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియాలో కూటమి నాయకులు పెడుతున్న పోస్టులను ప్రజలు తిప్పి కొడుతున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వంలో కూడా ఇదే సమస్య ఉన్నప్పటికీ పైసా నిధులు విడుదల చేయించలేని కూటమి నాయకులు ఇప్పుడిలా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని జనం విమర్శిస్తున్నారు.



రేబాక నుంచి అల్లుమియ్యపాలెం వరకు మెటల్ వేసి నిర్మించిన రోడ్డు.. 11.6 కి.మీ. రోడ్డులో 5 కి.మీ. గత ప్రభుత్వ పాలనలో పూర్తయింది.. మిగతా రోడ్డును ఇప్పుడు నిర్మిస్తున్నారు..

వైఎస్సార్‌సీపీ సర్కారు సమస్య తీర్చింది



చాలా ఏళ్లుగా ఈ రోడ్డు నిర్మించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం 30 ఏళ్ల పరిపాలించింది. ఒక్కసారి కూడా ఈ సమస్య గురించి ఆలోచించలేదు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను కృషి వల్ల మా గ్రామం నుంచి అల్లుమియ్యపాలెం గ్రామానికి తారురోడ్డు మంజూరు చేశారు. కల్వర్టులు అప్పుడే నిర్మించారు. రోడ్డు కూడా సగం అప్పుడే పూర్తయింది.

– సాదిరెడ్డి శేఖర్, రేబాక

ఎన్నికల ముందే రోడ్డు పనులు ప్రారంభం



ఎన్నికల ముందే రేబాక రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గత ఏడాది మార్చిలో రేబాక, సీతంపాలెం గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నికలు రావడంతో పనులు ఆగాయి. తాజాగా మొదలు మళ్లీ మొదలయ్యాయి. వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే రూ.8 కోట్లు మంజూరయ్యాయి. టీడీపీ నాయకులు తమ ప్రభుత్వంలో రోడ్డు మంజూరయిందని తప్పుడు ప్రచారం చేసుకోవడం దారుణం. మా గ్రామానికి వచ్చి తెలుసుకుంటే మంచిది.

– గాడి వీర్రాజు, రేబాక

ఒక్కో వ్యక్తికి ఒక్కో పోలీసు పెట్టాలా..

హోం మంత్రి అనిత అసహనం

- జగన్ భద్రతా వైఫల్యంపై మీడియా ప్రతినిధుల ప్రశ్నలు
- సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలిన హోం మంత్రి



విశాఖ సిటీ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రతా వైఫల్యంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. వారు అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పలేక చిందులు తొక్కారు. మాజీ మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రామగిరి పర్యటనలో భద్రతా వైఫల్యంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం విశాఖలో మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు జగన్ పర్యటనకు భద్రత కల్పించలేక ప్రభుత్వం చేతులెత్తేసిన అంశంపై హోం మంత్రికి ప్రశ్నలు సంధించారు. జగన్ పర్యటనకు భారీగా జనాలు వస్తారని గుర్తించలేకపోవడం ఇంటెలిజెన్స్ వైఫల్యమా? డ్రోన్, సీసీ కెమెరాల సర్వైలెన్సు ఉన్నప్పటికీ మాజీ ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతా వలయం బలహీనంగా ఉందా? అని విలేకరులు ప్రశ్నించారు. దీనిపై మంత్రి అనిత ముందు సమాధానం చెప్పలేక తడబడ్డారు. కొద్ది క్షణాల తర్వాత 1100 మందితో భద్రత కల్పించామని, అందరూ తోసుకెళ్లడంతో హెలికాప్టర్‌కు లైట్ క్రాక్ మాత్రమే అయిందని చాలా తేలికగా మాట్లాడారు. అంత మందితో భద్రత కల్పించినా జనాలు తోసుకుంటూ రావడం పోలీసుల వైఫల్యం కాదా? అని మీడియా అడిగితే.. ఒక్కో మనిషికి ఒక్కో పోలీస్‌ను పెట్టాలా? అని తిరిగి మంత్రి విచిత్రంగా ప్రశ్నించారు. ఇంతలో మరో ప్రశ్న వేస్తున్న సమయంలో అనిత మీడియాపై రుసరుసలాడుతూ మధ్యలోనే లేచి వెళ్లిపోయారు.

బకాయిలు చెల్లించాలని చెరకు రైతుల ధర్నా

- గోవాడ ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళన

చోడవరం: చెరకు రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. గత ఏడాదికి సంబంధించి టన్నుకు రూ.150తోపాటు ఈ ఏడాది క్రషింగ్‌కు సరఫరా చేసిన చెరకుకు పూర్తిగా పేమెంట్ చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ సీజన్ క్రషింగ్‌కు ఇంకా రైతుల వద్ద చెరకు ఉన్నప్పటికీ రెండ్రోజుల్లో క్రషింగ్ నిలిపివేస్తామని యాజమాన్యం ప్రకటించడం సరికాదని, రైతుల వద్ద పొలంలో ఎంత చెరకు ఉంటే అంతా పూర్తిగా తీసుకోవాలని, క్రషింగ్ గడువును మరింత పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది క్రషింగ్‌కు సంబంధించి సరఫరా చేసిన చెరకుకు టన్నుకు రూ.3 వేలు మాత్రమే చెల్లించారని, అది కూడా కొంతమందికి మాత్రమే ఇచ్చారని, ఇప్పటి వరకూ సరఫరా చేసిన చెరకు మొత్తానికి పేమెంట్స్ చెల్లించాలని రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీ నాయుడు, రమణ, రాజు, శ్రీను, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ మీద పడి కార్మికుడి మృతి

- ఎస్టార్ కెమికల్ ఫ్యాక్టరీ నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ



మృతి చెందిన హరినాథ్

బుచ్చెయ్యపేట: పొట్ట కూటి కోసం పనికి వెళ్లిన యువకుడు కెమికల్ మీద పడి మృత్యువాత పడ్డాడు. బుచ్చెయ్యపేట మండలం నీలకంఠాపురానికి చెందిన పడాల హరినాథ్ (22) మంగళవారం గ్రామ యువకులతో కలిసి అచ్యుతాపురంలో గల ఎస్టార్ కెమికల్ ఫ్యాక్టరీలో పనికి వెళ్లాడు. దినసరి కార్మికుడిగా ప్రైవేటు కాంట్రాక్టర్ వద్ద చేరిన ఈ యువకుడు కెమికల్ ఖాళీ డబ్బాలను లారీకి ఎక్కించుకుని పరవాడ వద్ద తుక్కు దుకాణం వద్ద అప్పగిస్తుంటాడు. ఆ క్రమంలో పరవాడలో తుక్కు ఇనుప కొట్టు వద్ద దించుతుండగా డబ్బా ఒకటి మూత ఊడిపోయి అందులో ఉండిపోయిన కెమికల్ శరీరంపై పడింది. దీంతో హరినాథ్ ఒళ్లంతా బొబ్బలెక్కి గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతన్ని వెంటనే కూర్మన్నపాలెంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో రాత్రికి విశాఖ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ హరినాథ్ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పడాల కన్నంనాయుడు, రాజ్యలక్ష్మిలకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు దివ్యాంగుడు కావడంతో రెండో హరినాథ్‌ను అల్లారుముద్దుగా పెంచుకున్నారు. డిగ్రీ చేసి ఖాళీగా ఉండటంతో పది రోజులుగా హరినాథ్ గ్రామస్తులతో కలిసి అచ్యుతాపురం కూలీ పనులకు వెళ్లి వస్తున్నాడు. ఇంతలోనే ఈ ప్రమాదం జరిగింది. ఎస్టార్ యాజమాన్యం శుభ్రపరచకుండా సరైన నిబంధనలు పాటించకుండా విషపూరితమైన కెమికల్ ఖాళీ డబ్బాలు నిర్లక్ష్యంగా తరలించడం వల్ల హరినాథ్ మృత్యువాత పడ్డాడని మృతుడి కుటుంబ సభ్యులు, మిత్రులు ఆరోపిస్తున్నారు. హరినాథ్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు విశాఖ వెళ్లి ఎస్టార్ కంపెనీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. యాజమాన్యం సకాలంలో స్పందించకపోవడంతో హరినాథ్ మృతదేహానికి పోస్టుమార్టమ్ పూర్తికాక కేజీహెచ్‌లోనే ఉండిపోయింది. జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ పడాల నాగభూషణం, మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ విశాఖ వెళ్లి హరినాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రుషిల్ డెకార్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



రుషిల్ డెకార్ పరిశ్రమలో అర్ధరాత్రి ఎగసిపడుతున్న మంటలు

- గోప్యంగా ఉంచిన యాజమాన్యం
- ప్రమాదంపై విచారణ చేపట్టాలని సిటు డిమాండ్
- ఫైర్ సేఫ్టీ లేకుండా అనధికారికంగా వేల టన్నుల కలప నిల్వలు



రుషిల్ డెకార్ పరిశ్రమ లోపల వేల టన్నుల కలప



మార్టూరుకు సమీపంలో నిల్వ చేసిన కలప

అచ్యుతాపురం రూరల్: రుషిల్ డెకార్ పరిశ్రమలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత బాయిలర్ ప్రదేశంలో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. 10 రోజులుగా షట్ డౌన్ పనులు చేసి ట్రయల్ చేస్తున్న సమయంలో ఇన్సులేషన్ మీద థెర్మిక్ ఫ్యూయల్ పడి అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని కార్మికులు చెబుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రమాదం జరగలేదు. అయితే పరిశ్రమ యాజమాన్యం అధికారికంగా ఎటువంటి వివరణ ఇవ్వలేదు. మంటలు ఎగసిపడటంతో చుట్టుపక్కల కార్మికులు భయాందోళనతో పరుగులు తీశారు. షట్ డౌన్ అనంతరం ట్రయల్ చేసే సమయంలో చుట్టుపక్కల కెమికల్ అవశేషాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు వహించకపోవడం వలనే అగ్ని ప్రమాదం జరిగిందని సీఐటీయూ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్లైవుడ్ తయారు చేసే ఈ పరిశ్రమ ప్రాంగణంలో వేల టన్నుల కలప ఉన్నందున అగ్ని ప్రమాదం భారీ స్థాయిలో జరిగి ఉంటే కోట్ల విలువైన రుషిల్ పరిశ్రమతోపాటు చుట్టుపక్కల చాలా కంపెనీలు, గ్రామాలు అగ్నికి ఆహుతై ఉండేవని కార్మికులు, స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పరిశ్రమ నిండా పెద్ద ఎత్తున ఎండిన వేల టన్నుల కలపతోపాటు ప్లైవుడ్ తయారీకి ఉపయోగించే కెమికల్స్‌ను కూడా నిల్వ చేశారు.

ఒక్క అగ్గి రవ్వ పడినా..

మార్టూరు గ్రామానికి సమీపంలో రుషిల్ డెకార్ పరిశ్రమ ప్రాంగణంలో వేల టన్నుల కర్రల మేట అనధికారికంగా నిల్వ చేసి ఉన్నారు. ఎటువంటి ఫైర్ సేఫ్టీ లేకుండా గ్రామాల మధ్యలో ఏర్పాటు చేసిన కర్రల నిల్వ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఏ ఒక్క చిన్న అగ్గి రవ్వ ఆ ఎండిన కర్రలపై పడినా మార్టూరు గ్రామంతో పాటు సెజ్ పునరావాస దిబ్బపాలెం పంచాయతీ అంతా అగ్ని ప్రమాదానికి గురవుతుందని భయాందోళన చెందుతున్నారు.

ప్రమాదంపై పూర్తి విచారణ చేపట్టాలి

ఈ సంఘటనపై సీఐటీయూ నాయకులు ఉదయం గేటు లోపల ఉన్న పరిశ్రమ సిబ్బందిని ప్రశ్నించగా వారు అసలు ఇక్కడ ఎటువంటి ప్రమాదం జరగలేదని తొలుత బుకాయించారు. అయితే తమ దగ్గర ఉన్న వీడియోలను వారికి చూపించడంతో రాత్రి అగ్నిప్రమాదం జరిగిందని అంగీకరించారు. ఎంత పెద్ద ప్రమాదం జరిగినా బయట ప్రపంచానికి తెలియనీయకుండా పరిశ్రమల యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాయే తప్ప ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం లేదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. గతంలో కూడా ఇదే పరిశ్రమలో ప్రమాదాలు జరిగి కార్మికులు అంగవైకల్యం పాలైనట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆరోపించారు. అగ్ని ప్రమాదంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావుతో కలిసి ఆయన డిమాండ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, లేబర్ అధికారులు నిరంతరం పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు.

మద్యం మత్తులో మరో దారుణం

- జాతరలో ఘర్షణ.. యువకుడి హత్య



మృతుడు రుత్తల దుర్గాప్రసాద్ (ఫైల్)



నిందితుడు మహేష్

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా లభ్యమవుతున్న మద్యంతో నేరాలు ఘోరాలు పెరుగుతున్నాయి. పట్టణంలో కొద్ది కాలంలోనే రెండు హత్యలు జరిగాయి. ఇవి మద్యం మత్తులో జరిగిన దారుణాలు కావటం గమనార్హం. ఆరు నెలల క్రితం కొత్తవీధిలో యువకుల మధ్య జరిగిన ఘర్షణ హత్యకు దారితీసింది. తాజాగా అయ్యన్నకాలనీలో తలుపులమ్మ తల్లి జాతరలో మద్యం మత్తులో మరో హత్య జరిగింది. ఈ ఘటనలో నీలంపేట గ్రామానికి చెందిన రుత్తల దుర్గాప్రసాద్ (22) ప్రాణాలు కోల్పోయాడు. టౌన్ సీఐ గోవిందరావు కథనం ప్రకారం.. అయ్యన్నకాలనీలో మంగళవారం రాత్రి తలుపులమ్మ తల్లి జాతర జరిగింది. జాతర సందర్భంగా డాన్స్ బేబీ డాన్స్ స్టేజ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. మృతుడు రుత్తల దుర్గాప్రసాద్, తన స్నేహితుడైన మాకవరపాలెం మండలానికి చెందిన పైల సాయితో కలిసి అక్కడికి వచ్చాడు. అదే కాలనీకి చెందిన చిత్రాడ మహేష్ స్టేజ్ వద్దకు వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న మహేష్, మృతుడు దుర్గాప్రసాద్ స్టేజ్ ప్రోగ్రాం విషయంలో గొడవపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు ఇరువురికీ సర్దిచెప్పి పంపించేశారు. దుర్గాప్రసాద్, సాయి అదే కాలనీలో ఉంటున్న వాళ్ల అన్నయ్య ఇంటికి వెళ్లి పడుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో మహేష్ తన అనుచరులతో దుర్గాప్రసాద్ అన్న ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగాడు. తన వెంట తీసుకెళ్లిన కత్తితో దుర్గాప్రసాద్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి కొనఊపిరితో ఉన్న దుర్గాప్రసాద్‌ను నర్సీపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చేతికి అందివచ్చిన కుమారుడు హత్యకు గురికావడంతో తల్లి దేవుడమ్మ కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. ఇటీవల మృతుడి తండ్రి మృతి చెందారు. ఈ హత్యా ఉదంతంతో ఆ కుటుంబం మగదిక్కును కోల్పోయింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో మృతుడి స్నేహితుడు సాయికి స్వల్ప గాయాలయ్యాయి.

బహిరంగ మద్య సేవనంతోనే హత్యలు : సీఐ

హత్యకు పాల్పడిన మహేష్ పరారయ్యాడని, అతని కోసం గాలిస్తున్నామని సీఐ గోవిందరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడబడితే అక్కడ బహిరంగంగా మద్యం సేవించడం వల్ల ఎక్కువగా నేరాలు జరుగుతున్నాయన్నారు. రోజుకు పదికిపైగా మద్యం కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అయినా నేరాలు ఆగటం లేదన్నారు.

ఆర్ భీమవరంలో 110 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా

- అనకాపల్లికి చెందిన వ్యాపారి, టీడీపీ నాయకుడి చేతుల్లో కబ్జా స్థలం
- గ్రామదేవత పడమటమ్మ ఆలయ భూమి ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు
- గ్రామస్తుల ఆగ్రహం

బుచ్చెయ్యపేట : మండలంలోని ఆర్.భీమవరం గ్రామంలో సుమారు 110 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఈ గ్రామానికి దగ్గరలో ఉన్న అనకాపల్లికి చెందిన వ్యాపారులు, గ్రామ నాయకుడు కలిసి ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. సుమారు రూ.25 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు దారి తీస్తోంది. ఆక్రమణకు గురైన భూముల్లో గ్రామదేవత పడమటమ్మ ఆలయానికి చెందిన భూములు కూడా ఉన్నాయి. ఆక్రమణదారులపై గ్రామస్తులు ఎదురుతిరిగినా రెవిన్యూ, పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు చోద్యం చూడడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామదేవత పడమటమ్మకు చెందిన 10 భూములతో పాటు కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు కాపాడకపోతే టెంట్ వేసి ధర్నాకు దిగడానికి గ్రామస్తులు సన్నద్ధమౌవుతున్నారు. వివరాలివి. ఆర్.భీమవరం గ్రామ శివారులో సర్వే నంబర్ 173లో సుమారు 70 ఎకరాలు, సర్వే నంబర్ 221లో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 173 సర్వే నంబర్‌లో 35 ఏళ్ల కిందట ఇదే గ్రామానికి చెందిన నిరుపేదలు నిట్టా కొండయ్య, మండపాటి దేముడు, వెలంకాయల గంగులుకి డీ పట్టాలు ఇచ్చినట్టు రికార్డుల్లో ఉన్న ఈ భూములు కూడా అనకాపల్లికి చెందిన బడా వ్యాపారుల కబ్జాలో ఉన్నాయి. పూర్వం నుంచి అమ్మవారికి కేటాయించిన భూములను సైతం ఇటీవల గ్రామ నాయకుడు ఆక్రమించి ఫెన్సింగ్ వేసి మొక్కలు నాటి కబ్జా చేయడంపై గ్రామస్తులంతా కలిసి తిరగబడ్డారు. ఫెన్సింగ్‌ను పీకేయడానికి చూడగా ఇరువర్గాల వారికి గొడవలు జరిగాయి. అయినా రెవిన్యూ అధికారులు సర్వే చేసి అమ్మవారి భూములు అప్పగించలేదు. సర్వే నంబర్ 173లో ఉన్న 70 ఎకరాలకు పూర్తి స్థాయిలో సర్వే చేసి పట్టాలిచ్చిన పేదలకు భూములు కేటాయించాలని, అమ్మవారి భూములు కేటాయించి సరిహద్దులు తేల్చాలని, సర్వే నంబర్ 221లో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిని పేదలకు పంచాలని రెండు నెలల క్రితం గ్రామ నాయకులు, ప్రజలు కవల సతీష్, రాజారావు, వెలంకాయల అప్పారావు, మండపాక నూకరాజు, శ్రీనివాస్, కాలపురెడ్డి నగేష్ తదితరులు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే చేయించి అమ్మవారి భూములను కబ్జా అవనీయకుండా కాపాడతానని ఎమ్మెల్యే మాట ఇచ్చినా నేటికీ అధికారులు సర్వే చేయలేదని, ఆక్రమణలు తొలగించలేదని గ్రామస్తులు ఆగ్రహం చెందుతున్నారు. ఆర్.భీమవరంలో ప్రభుత్వ భూములను, గ్రామదేవత పడమటమ్మ ఆలయ భూములను కాపాడకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి గ్రామస్తులు సన్నద్ధం అవుతున్నారు.


ఆర్ భీమవరంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమి


గ్రామదేవత పడమటమ్మ భూములను కాపాడాలని కోరుతున్న గ్రామస్తులు


ఆక్రమణలకు గురైన భూములను చూపిస్తున్న గ్రామస్తులు

ఇదే గ్రామంలో మరో భూమాయ

ఇప్పటికే ఇదే గ్రామంలో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని జిరాయితీ భూమిగా తప్పుడు సర్వే నంబర్లు వేసి ఒక వ్యాపారికి గ్రామ నాయకుల ద్వారా అమ్మకాలు చేశారు. ఇటీవల రీ సర్వేలో అది ప్రభుత్వ భూమి అని తెలియడంతో వ్యాపారి కడియాల రాజేశ్వరరావు మోసపోయానని తెలుసుకున్నాడు. తాను కొన్న భూమిని తిరిగి ఇచ్చేయాలని గ్రామ నాయకులు ఒత్తిడి చేయడంతో విసుగు చెందిన వ్యాపారి ఈ నెల 3వ తేదీన జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను కలిసి 30 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్టు తన వద్ద ఉన్న భూ రికార్డులను కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా అధికారులు ఆర్.భీమవరం రెవిన్యూలో పూర్తి స్థాయిలో భూ సర్వే చేయిస్తే మరిన్ని భూ కబ్జాలు బయటపడతాయని, ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మిని వివరణ కోరగా జిల్లా అధికారులు దృష్టికి తీసికెళ్లి పై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలి



ఉత్తమ సేవలు అందించిన పోలీస్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

- రాష్ట్ర ఐజీ ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ పాలరాజు
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందించిన ఎస్పీ సిన్హా

అనకాపల్లి : పోలీసు స్టేషన్లలో నమోదవుతున్న కేసుల దర్యాప్తు పురోగతిని సి.సి.టి.ఎన్.ఎస్. (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్)లో సమయానికి నమోదు చేయాలని రాష్ట్ర ఐజీ ఎఫ్.ఎ స్.ఎల్. డైరెక్టర్ జి.పాలరాజు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంత నేర సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో అన్ని రివ్యూ మీటింగులు సి.సి.టి.ఎన్.ఎస్. ఆధారంగా నిర్వహించనున్నందున, ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ కేసుల దర్యాప్తులో నిందితుల ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, ఐపీ అడ్రస్ ఆధారంగా త్వరితగతిన లోకేషన్ గుర్తించి, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పోలీస్ స్టేషన్‌లో ఎక్కువగా ఏ రకమైన కేసులు నమోదు అవుతున్నాయో గుర్తించి, సమీక్షించి తగ్గించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెట్టీ కేసుల నమోదు, కోర్టులలో జరిమానా విధింపు తదితర అంశాలపై కోర్టు కానిస్టేబుళ్లను అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ డ్రోన్‌ల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, పండగలు, జాతర్ల వద్ద నిఘా పెంపు చేయాలని, పేకాట, ఓపెన్ డ్రింకింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయాలు, ప్రార్థనా స్థలాలు, లేడీస్ హాస్టళ్ల భద్రత కోసం సీసీ కెమెరాలు, వాచ్‌మెన్ ఏర్పాటు చేయించాలన్నారు. హిస్టరీ షీటర్లపై నిఘా ఉంచి, కౌన్సెలింగ్ ఇవ్వాలని, హత్య, అత్యాచారం, గంజాయి, రోబరీ, దొంగతనాలు, పోక్సో కేసుల్లో నిందితులపై ప్రత్యేక దృష్టి సాధించి, అవసరమైతే రౌడీ/హిస్టరీ షీట్లు ఓపెన్ చేయాలని ఆదేశించారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, ట్రైనీ డీఎస్పీ ఎం.వి.కృష్ణ చైతన్య, సీఐలు లక్ష్మణమూర్తి, టి.లక్ష్మి, రమేష్, గఫూర్, ఎస్ఐలు ప్రసాద్, సురేష్, వెంకన్న, రమణయ్య పాల్గొన్నారు.

రైల్వే క్రీడాసంఘం నూతన కార్యవర్గం

విశాఖ స్పోర్ట్స్: తూర్పు కోస్తా రైల్వే క్రీడా సంఘం వాల్తేర్(ఈకోర్సా) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షునిగా డీఆర్ఎం లలిత్ బోరా కొనసాగనుండగా క్రీడాధికారిగా సీనియర్ డీఎఫ్ఎం ఎం.హేమంత్ ఎన్నికయ్యారు. సంయుక్త క్రీడాధికారిగా ఎ.అవినాష్ కొనసాగనుండగా సహాయ క్రీడాధికారులుగా ఔట్‌డోర్ క్రీడలకు డీఈఈ సాహు, ఇండోర్ క్రీడలకు సీడీఓ పాటిల్ పర్యవేక్షించనున్నారు. కార్యదర్శిగా ధ్యాన్‌చంద్ అవార్డీ ఎన్.ఉష వ్యవహరించనున్నారు. ఉపాధ్యక్షులుగా ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్, ఈ.సాంతారామ్, సలహాదారుగా సీనియర్ డీఈఎన్ అరుణకుమార్ మోహరానా, కోశాధికారిగా సీనియర్ డీపీవో జుసఫ్ కబీర్ అన్సారి సేవలందించనున్నారు.

టీడీఆర్ బాండ్లు మాకొద్దు

- మాట నిలుపుకోండి.. పరిహారం జమ చేయండి
- ఆర్డీవోకు పూడిమడక రోడ్డు విస్తరణ బాధితుల స్పష్టీకరణ
- మునగపాకలో టీడీఆర్ బాండ్లపై అవగాహన సమావేశం

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో భూములు, గృహాలు కోల్పోతున్న నిర్వాసితులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. రహదారి విస్తరణ ప్రతి ఒక్కరికీ సమ్మతమేనని, అయితే గత గ్రామసభల్లో ఇచ్చిన హామీకి కట్టుబడాలన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ.. టీడీఆర్ బాండ్ల వలన తమకు ప్రయోజనం లేదని, ప్రభుత్వం నేరుగా పరిహారాన్ని అకౌంట్‌లో జమ చేయాల్సిందేనని పట్టుబట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే పరిహారం నిర్ణయించారని, అయితే పెరిగిన భూమి ధరలకు అనుగుణంగా పరిహారం పెంచుతారని నిర్వాసితులు ఆశించారన్నారు. అయితే రహదారి విస్తరణ జరిగితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న ఆశతో గతంలో నిర్ణయించిన ధరకు అంగీకరించారన్నారు. పరిహారాన్ని టీడీఆర్ బాండ్ల రూపంలో ఇవ్వడం వలన ప్రయోజనం ఉండదన్నారు. ఇందుకు స్పందించిన ఆర్డీవో ఆయిషా మాట్లాడుతూ తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రహదారి విస్తరణ అవసరమన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం టీడీఆర్ బాండ్లను పరిహారంగా ఇస్తుందని చెబుతూ.. ఈ బాండ్ల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, స్థానికులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, ఆడారి అచ్చియ్యనాయుడు, దాడి ముసిలినాయుడు, ఆడారి శ్రీకాంత్, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.


నిర్వాసితుల సమస్యలను ఆర్డీవో ఆయిషా దృష్టికి తీసుకువస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

చేపలకు చికెన్ మేత!


డ్రమ్‌లలో తరలిస్తున్న చికెన్ వ్యర్థాలు


చికెన్ వ్యర్థాలతో పెరిగిన ప్రజారోగ్యానికి హాని కల్గించే చేపలు

- విచ్చలవిడిగా చికెన్ వ్యర్థాల వినియోగం
- ప్రజారోగ్యంతో చెలగాటం
- పట్టించుకోని పోలీసులు, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు
- సీపీఎం నేత వెంకన్న ధ్వజం

దేవరాపల్లి : చెరువుల్లో చేపలకు మేతగా యథేచ్ఛగా చికెన్ వ్యర్థాలను తరలిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా చికెన్ దుకాణాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలతో కొందరూ మాఫియాగా ఏర్పడి దర్జాగా వ్యాపారం చేస్తూ కాసులు గడిస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి విశాఖతో పాటు పొరుగు జిల్లాలకు సైతం కోళ్ల వ్యర్థాలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ వ్యర్థాలను తినే చేపలను తింటే క్యాన్సర్ వస్తుందని వైద్యులు చెబుతున్నా మాఫియా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్లాస్టిక్ డ్రమ్‌ల్లో నింపి వాహనాల్లో తరలిస్తున్నారన్నారు. కోళ్ల వ్యర్థాలను తినడం వల్ల త్వరగా చేప బరువు పెగడంతో పాటు మేత ఖర్చు కూడా తగ్గుతుండడంతో చేపల చెరువుల నిర్వాహకులు వీటిపైనే మొగ్గు చూపుతున్నారన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో ఈ చికెన్ వ్యర్థాల దందా బహిరంగంగా జరుగుతున్నా, పోలీసులు, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కోళ్ల వ్యర్థాలతో పెంచిన చేపలను తినడం వల్ల క్యాన్సర్ కాలేయ, జీర్ణకోశ, గ్యాస్ట్రిక్, మలబద్ధకం, పైల్స్, చర్మ వ్యాధులు, ప్రేగుల్లో పుండ్లు తదితర రోగాలు వస్తాయని నిపుణులు చెబుతన్నారన్నారు. కోళ్ల వ్యర్థాలను నిల్వ చేయడం వల్ల పర్యావరణం కలుషితమవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు మామ్మూళ్ల మత్తు వీడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కోళ్ల వ్యర్థాల మాఫియాను కట్టడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Admissions Open : Course - PHYSIOTHERAPY. Eligible for Inter (Bi.P.C), Scholarship for SC, ST, BC. At Ghat Road Jn., V.Madugula, Anakapalli Dist. Ph : 89196 24844, 97002 34566 [SCA25002578]

Real Estate

■ GVMC పరిధిలో Layout వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్ కావలెను. బస్ రోడ్డుకి అనుకొని కమర్షియల్ బిట్లు కలవు. సంప్ర।। 80196 24319. [V- 823980]

PLOT FOR SALE

■ తగరపువలస, భోగాపురంలో శుభగృహ వారి సుకృతి సాస్కి వెంచర్లో VMRDA RERA అప్రూవ్డ్ Plots కలవు, గజం : 14,000/- Axis Bank లోన్, గజంకి 11,000/- వస్తుంది. ఫోన్ : 99634 80379, 96766 79966 [V- 12422]

Services

BUSINEE OFFER

■ పర్సనల్, వ్యవసాయ భూములకు, రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు, ఇండస్ట్రీయల్ లకు ఫైనాన్స్ సలహాల కొరకు సంప్రదించండి. ఫోన్ : 90632 90864 [V- 791092]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

HEALTH CARE

■ అధికబరువు, డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళన, మోకాలు నొప్పులు, నరాలబలహీనతకు, యోగా, ధ్యానము, పంచకర్మలు చేయబడును. సంప్రదించండి : 91600 92221 [SCA25002672]

Wanted

■ మా కంపెనీలో పనిచేయుటకు Telecallers (F), Suervisors (M), Marketing Executives (M) కావలెను. (Only Calls). ✆ : 97033 98398 [V- 1287]

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి నుండే మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను మీ పేరు వాట్సాప్ చేయగలరు. ✆ : 82975 53129 [SCA-25002642]

■ గాజువాక శ్రీనగర్ ఏరియాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం।।ల డ్యూటీకి సాలరీ 11000/- + PF + ESI, అర్హత : 10th పాస్ / ఫెయిల్, వ : 35 to 50. ఫోన్ : 77804 78285 [V- 2774]

■ త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఉచిత వసతి భోజనం. జీతం:18K.Ph:8520980099, 8520874499 [HA-1906]

గమనిక


సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

• నిలిచిన డ్రెడ్జింగ్



బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మంగళవారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు సాధారణ స్థాయికి మించి ఎగసిపడ్డాయి. ఈ ప్రభావం సబ్‌మెరైన్ మ్యూజియం వెనుక భాగంలో జరుగుతున్న డ్రెజ్జింగ్ పనులపై పడింది. ఉవ్వెత్తున ఎగిసిపడిన కెరటాల ధాటికి డ్రెడ్జర్ నుంచి తీరానికి ఇసుకను తరలించడానికి ఉపయోగించే భారీ రబ్బరు ట్యూబ్ ఒడ్డుకు కొట్టుకువచ్చింది. దీంతో డ్రెజ్జింగ్ పనులు నిలిచిపోయాయి. ఈ రబ్బరు ట్యూబ్‌ను తిరిగి డ్రెజ్జర్‌కు అనుసంధానించి పనులను ప్రారంభించేందుకు డీసీఐ చర్యలు తీసుకుంటోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తీర ప్రాంతాల్లో 'సాగర్ కవచ్'


రుషికొండ బీచ్‌లో పర్యటించిన మెరైన్ డీఐజీ గోపినాథ్ జెట్టీ

కొమ్మాది: సాగర తీర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం భీమిలి, మంగమారిపేట, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రుషికొండ బీచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ పి.మనోజ్ కుమార్ తీర ప్రాంతాల అప్రమత్తతపై మత్స్యకారులకు, పర్యాటకులకు వివరించారు. తీర ప్రాంతాల వెంబడి ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే ఎలా ఎదుర్కొని పోలీసులకు సమాచారం ఇవ్వాలి, ఎలా అప్రమత్తంగా ఉండాలి, గూఢచారి వ్యవస్థలను ఎలా కనుగొనాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

డీఐజీ పర్యటన

సాగర్‌కవచ్‌లో భాగంగా రుషికొండ బీచ్‌లో బుధవారం రాత్రి మెరైన్ డీఐజీ గోపినాథ్ జెట్టీ పర్యటించారు. ఇక్కడ బీచ్‌లోని పర్యాటకులతో కాసేపు మాట్లాడి, మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఆయన వెంట మెరైన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు మురళీకృష్ణ, పి. మనోజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మునగపాక : మండలంలోని నాగవరం దరి బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాలివి. అచ్యుతాపురం నుంచి ప్రయాణికులతో ఆటో పరవాడ వైపునకు వెళుతుండగా నాగవరం దగ్గరకు వచ్చే సరికి పరవాడ నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రసాదరావు తెలిపారు.

బావిలో కాలుజారి పడి యువకుడి మృతి

అనకాపల్లి : సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాలేపుసాయి గణేష్ (30) స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాల సమీపంలో బావిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ బుధవారం కాలు జారి పడిపోయి మృతి చెందాడు. మృతుడి సోదరుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. పట్టణంలో చిన్నరాజుపేటకు చెందిన కాలేపు సాయిగణేష్ వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. ప్రతి రోజు మాదిరిగానే నూతిలోకి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతిచెందినట్టు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

50 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధం

- రూ.1.50 కోట్ల ఆస్తి నష్టం

బుచ్చెయ్యపేట : మండలంలో గల చింతపాక, గున్నెంపూడి గ్రామాల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 50 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్గం కాగా కోటి 50 లక్షలు వరకు ఆస్తినష్టం జరిగింది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి కిలోమీటరన్నర దూరంలో ఉండటంతో రైతులు అగ్ని ప్రమాదాన్ని ముందుగా గుర్తించలేదు. సరుగుడు తోటల్లో నుండి పొగ రావడంతో రైతులు తీవ్ర ఎండలో పొలాల్లోకి పరుగులు తీశారు. అప్పటికే చాలా మంది రైతుల సరుగుడు తోటలు పూర్తిగా మంటల్లో కాలిపోగా మిగిలిన రైతులంతా కలిసి మంటలను అదుపు చేశారు. చింతపాకతో పాటు పక్కనే ఉన్న రావికమతం మండలం గొంప రెవిన్యూ వరకు మంటలు వ్యాపించాయి. చింతపాక రెవిన్యూలో ఉన్న సోమయాజులు చెరువు కింద ఉన్న భూముల్లో కొంగా నాగరాజు,రమణ,రాజు,సలాది సత్యం, నాగరాజు,పరవాడ నాగరాజు,బంగారు నాయుడు,పరవాడ తమ్మునాయుడు,పాకంశెట్టి సన్యాసిరావు,కొంగా రాజబాబు,సలాది గణ,సత్తిబాబు,చెల్లిబాబు,దుర్గమ్మ,శాంభయ్య,నూకాలమ్మ,నిట్టా సత్తిబాబు తదితర రైతుల సరుగుడు తోటలు కాలిపోయాయి. సుమారు 80 మంది రైతులకు చెందిన సరుగుడు తోటలు కాలిపోగా రూ.కోటి 50 లక్షలు వరకు ఆస్థి నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోయారు. మంటలు ఆర్పడానికి 101కి ఫోన్ చేయగా విశాఖ అగ్నిమాపక అధికారులు ఫోన్‌లో మాట్లాడి రావికమతం అగ్నిమాపక అధికారులు నెంబర్ 08934 226111కి ఫోన్ చేయమన్నారు. ఈ నెంబర్‌కు ఫోన్ చేసినా పని చేయలేదని బాధిత రైతులు తెలిపారు. దీనిపై రావికమతం అగ్నిమాపక సిబ్బందిని వివరణ కోరగా విద్యుత్ సరఫరా లేకపోతే ఫోన్ పనిచేయదన్నారు. ఒక్కో రైతుకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.


మంటల్లో కాలిపోతున్న సరుగుడు తోటలు

ఉద్దండపురంలో వృద్ధురాలి అనుమానాస్పద మృతి

- ప్రత్యర్థులు కొట్టడం వల్లే చనిపోయిందని కుటుంబీకుల ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు

నక్కపల్లి : మండలంలో ఉద్దండపురం గ్రామంలో ఆవాల లక్ష్మి (60) అనే వృద్ధురాలు అనుమానాస్పదంగా మరణించింది. తన తల్లి మరణానికి తనతో గొడవపడిన వ్యక్తులే కారణమని, తనను తన తల్లిని తీవ్రంగా గాయపరచడం వల్లే అనారోగ్యానికి గురై మరణించిందని మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే ఉద్దండపురం గ్రామానికి చెందిన అవాల సురేష్ మార్నింగ్ స్టార్ బస్సులో, ఇదే గ్రామానికి చెందిన వెలం శెట్టిశ్రీను షామోలి బస్సులో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. తాజాగా సురేష్ తాను పనిచేసే బస్సులో మానేసి షామోలి బస్సులో పనిచేసేందుకు హైదరాబాద్ బయలు దేరాడు. ఈ విషయం తెలుసుకున్న వెలంశెట్టి శ్రీను షామోలి బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్న కుర్ర సాయికి ఫోన్ చేసి ఆవాల సురేష్ గురించి దుర్భాషలాడాడు. ఈ విషయం తెలిసిన సురేష్, శ్రీనుతో ఫోన్‌లో గొడవపడ్డాడు. ఈనెల 4వ తేదీన ఇరువర్గాలు గ్రామ పెద్దల వద్ద పంచాయతీ పెట్టుకుని బాహాబాహీకి తలపడ్డారు. ఈ ఘర్షణలో వెలంశెట్టి శ్రీను అతని కుటుంబ సభ్యులు సురేష్, అతని తల్లిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో సురేష్ తల్లి తీవ్ర అస్వస్థతకు గురయింది. కడుపులో నొప్పి రావడంతో ఏడో తేదీన నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తునిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నయం కాకపోవడంతో అక్కడ నుంచి విశాఖలో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో వృద్ధురాలు మరణించింది. దీంతో తన తల్లి మరణానికి వెలం శెట్టి శ్రీను, అతని కుటుంబ సభ్యులు దాడి చేయడమే కారణమని వారు కొట్టడం వల్లే తన తల్లి అనారోగ్యానికి గురై మరణించిందని మృతురాలు కుమారుడు ఆవాల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి మరణానికి గల కారణాలను తెలుసుకునేందుకు కేజీహెచ్‌కు పంపిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నక్కపల్లి ఆస్పత్రిలో ఉన్న లక్ష్మి మృతదేహాన్ని సీఐ కుమార స్వామి పరిశీలించారు. బాధిత కుటుంబీకుల నుంచి వివరాలు సేకరించారు. శ్రీను కుటుంబ సభ్యులు దాడి చేయడం వల్లే లక్ష్మి మరణించిందని వైద్యులు ధ్రువీకరిస్తే కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.



ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కుమార స్వామి, (ఇన్‌సెట్) మృతురాలు ఆవాల లక్ష్మి

క్లుప్తంగా

సీనియర్ సిటిజన్ కార్డుల కోసం పేర్ల నమోదు


జెడ్సీ రమణ

అనకాపల్లి టౌన్: పట్టణ పరిధిలో 60 ఏళ్లు దాటిన వృద్ధులంతా సీనియర్ సిటిజన్ కార్డుల కోసం సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ రమణ తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డుతో ఆర్టీసీ బస్సుల్లో రాయితీ, ప్రభుత్వం అందించే మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కార్డు పొందాలనుకునే వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ లింక్ ఫోన్ నంబర్, బ్లడ్ గ్రూప్, ఎమర్జెన్సీ కాంట్రాక్టు నంబర్ తదితర వివరాలు తెలపాలని కమిషనర్ సూచించారు.

40వ రోజుకు ఆర్టీసీ కార్మికుల దీక్షలు


రిలే దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్, కండక్టర్లపై అక్రమ సస్పెన్షన్లను రద్దు చేసి, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఎన్ఎంయూఏ జోనల్ కార్యదర్శి జి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 40వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10, 11 తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్స్, ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.రావు, కె.ఎం.వి.రమేష్, కె.పి.రావు, వి.పి.రావు, ఎం.వి.ఎస్.ఎ.రావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ నేత 'చంద్ర'కు ఘన నివాళి


చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజాన దొరబాబు

అనకాపల్లి: సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు తన యావదాస్తిని పేద ప్రజలకు పంచిపెట్టి, గొప్ప మానవతావాదిగా పేరొందారని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం చంద్ర 31వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ కార్మిక, కర్షక ఉద్యమాలే ఊపిరిగా చంద్ర పోరాటాలు చేశారన్నారు. నేటి యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కోరిబిల్లి శంకరరావు, వియ్యపు రాజు, విత్తనాల పోతురాజు, బోయిన గోవింద్, ముత్తుర్తి సూరిబాబు, కె.బుజ్జిబాబు, ఈశ్వరరావు, జగదీష్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

14 న నవగ్రహాలు గుడి ప్రతిష్ట

మాడుగుల రూరల్ : మాడుగుల దబ్బకుంట రహదారిలో పంట పొలాల మధ్యలో కొలువు తీరిన పురాతన చరిత్ర కలిగిన శ్రీ భీమలింగేశ్వర స్వామి వారి ఆలయం ఆవరణలో నిర్మించిన నవగ్రహాలు గుడిని ఈ నెల 14 న ప్రారంభించనున్నారు. ఈ మేరకు మాడుగులకు చెందిన బెన్నాబత్తుల మురళి నిర్మించిన నవగ్రహాలు గుడిని ఈ నెల 14 న ప్రారంభించనున్నట్టు, దీనిలో భాగంగా ఈ నెల 13వ తేదీన హోమాది కార్యక్రమాలు, 14న అన్నసమారాధన జరుగుతుందన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 3,518 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	3,500	4.250
రెండో రకం	3,190	3,840
మూడో రకం	2,910	3,180

అనకాపల్లి సినిమాలు

రాజా	:మాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
సత్యనారాయణ స్క్రీన్-2	:రాజుగారి దొంగలు
పర్తిసాయి	:కోర్టు
షిర్డీసాయి	:లైఫ్
వెంకటేశ్వర	:ఆదిత్య 369
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	:వీరధీరశూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-9 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

పెరిగిన వ్యయం.. నిలిచిన నిర్మాణం!


కశింకోట ఇందిరా కాలనీలో అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ సామాజిక భవనం

కశింకోటలో ఆగిపోయిన అంబేడ్కర్ సామాజిక భవన పనులు

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.50 లక్షలతో నిర్మాణానికి శ్రీకారం

వ్యయం పెరగడంతో రెండు నెలలుగా నిలిచిన పనులు

కశింకోట: కశింకోట ఇందిరా కాలనీలో తలపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనం నిధుల లేమితో అసంపూర్తిగా దర్శనమిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.50 లక్షలు మంజూరు కావడంతో పనులు చేపట్టారు. నిర్మాణం ప్రారంభించిన తర్వాత అంచనా వ్యయం పెరిగిపోవడంతో రెండు నెలల క్రితం పనులు నిలిచిపోయాయి. దీంతో వివాహాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అవకాశం లేకుండాపోయింది. కశింకోట రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఇందిరా కాలనీలో స్థానికుల అభ్యర్థన మేరకు 2023-24 సంవత్సరం ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.50 లక్షల అంచనా వ్యయంతో అప్పటి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి సామాజిక భవనాన్ని మంజూరు చేశారు. కాంట్రాక్టర్ పనులను చేపట్టి భవన నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేశారు. తుది మెరుగులు కోసం నిధులు సరి


గచ్చులు లేని హాలు

పోలేదని రెండు నెలల క్రితం పనులు ఆపేశారు. భవనం లోపల గచ్చులు ఏర్పాటు చేయాల్సి ఉంది. మేడ పైన చుట్టూ పిట్ట గోడ నిర్మించలేదు. శ్లాబ్ ఊడ్చలేదు. మంచినీటి బోరు వేయాలి. విద్యుత్ సదుపాయం కల్పించి లైటింగ్ సమకూర్చాల్సి ఉంది. మరుగుదొడ్ల ట్యాంకు నిర్మించాల్సి ఉంది. రక్షణగా ప్రహరీని నిర్మించాలి. ఇందుకు సుమారు రూ.20 లక్షలు వ్యయం కాగలదని సమాచారం. ఇక్కడ సామాజిక భవనం లేక పెళ్లిళ్లు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి సుదూరం వెళ్లాల్సిన పరిస్థితిని స్థానికులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల వద్ద నిర్వహించుకోవాలంటే స్థలం సరిపోక, వాతావరణం అనుకూలించక నానా అవస్థలు పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ భవనం అందుబాటులోకి వస్తే ఇందిరా కాలనీతో పాటు అఫీషియల్ కాలనీ, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంత వాసులకు ఉపయోగపడనుంది. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనానికి అవసరమైన నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయడానికి సత్వరమే అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పిట్ట గోడ నిర్మించని భవనం పైభాగం

శుభ కార్యాలకు అవస్థలు



కశింకోట ఇందిరా కాలనీలో నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనం తుది మెరుగులు పూర్తి కాక అసంపూర్తిగా ఉంది. దీన్ని సత్వరమే పూర్తి చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. సామాజిక భవనం లేక పెళ్లిళ్లు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– దిమ్మల సూరిబాబు, వార్డు సభ్యుడు, ఇందిరా కాలనీ

త్వరితగతిన భవనం పూర్తి చేయాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. ఇక్కడ సామాజిక భవనం లేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– బిరుదుగంటి ఎఫినెట్, ఇందిరా కాలనీ, కశింకోట

నేడు సత్యమాంబ ఆలయ వార్షికోత్సవం


సత్యమాంబ అమ్మవారు

కశింకోట: కశింకోటలోని శారదానది అవతల వంతెన వద్ద కొలువైన శారదా సత్యమాంబ అమ్మవారి ఆయన దశమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ తీగల కింద జంగిల్ క్లియరెన్స్, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం డీ-1 సెక్షన్ టౌన్-1 పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. గుండాల జంక్షన్, మిరియాల కాలనీ, లక్ష్మీదేవిపేట, సాయినగర్, న్యూకాలనీ, వేల్పులవీధి, బాలికోన్నత హైస్కూల్ ఏరియా, రావుగోపాలరావు కళాక్షేత్రం ఏరియా, ఆర్టీసీ కాంప్లెక్స్, పూడిమడక జాతీయ రహదారి వరకూ విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

తల్లీబిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


కశింకోటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి, తదితరులు

కశింకోట: తల్లి, శిశువుల ఆరోగ్యంపై రెండేళ్లపాటు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి కోరారు. కశింకోట పందిరి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి శిశువు జన్మించి రెండేళ్ల కాలం అతి ముఖ్యమైందన్నారు. ఈ వెయ్యి రోజుల కాలానికి తల్లి, శిశువుకు తగిన సంరక్షణ కల్పించినట్లయితే శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడన్నారు. పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల్లో ఊబకాయం చాలా ప్రమాదకరమని, దీన్ని నియంత్రించడానికి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. చిరు ధాన్యాల వల్ల అనేక ప్రయోజనాలున్నాయని, వాటి గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారులు స్వయంగా తమ పేరు నమోదు చేసుకోవడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకున్నట్లేనన్నారు. ముందుగా పోషణ్ పక్వాడాపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.ఝాన్సీరాణి, మహిళా సంరక్షణ కార్యదర్శి రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

కశింకోట: తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.గ్రేస్ తెలిపారు. 5వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరు కావాలని కోరారు.

ఐటీఐ ట్రేడ్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోండి

నర్సీపట్నం : ఆల్ ఆలిండియా ట్రేడ్ టెస్ట్‌కు ప్రైవేటుగా వివిధ ట్రేడ్‌లలో ప్రైవేట్‌గా పని చేసుకునే అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసచార్యులు పేర్కొన్నారు. ఐటీఐకు సంబంధించిన ట్రేడ్‌ల్లో నైపుణ్యం కలిగి ప్రైవేట్‌గా పని చేసుకునే వారికి సర్టిఫికెట్ పొందేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందన్నారు. అప్రెంటిస్ ట్రైనింగ్ ఇస్తున్న కంపెనీలు, ఎంఎస్ఎంఈలు, రిజిస్టర్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో కనీస అనుభవం కేటగిరిని బట్టి ఏడాది నుంచి 3 ఏళ్లు ఉండాలన్నారు. మీరు పని చేస్తున్న కంపెనీ వివరాలు, ట్రేడ్‌కు సంబంధించిన వివరాలతో పాటు సర్వీస్ సర్టిఫికెట్‌ను దగ్గరలో గల గవర్నమెంట్ ఐటీఐలో సంప్రదించాలన్నారు. ఈ నెల 12వ తేదీగాలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


క్రీడా మైదానంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి నెల పండగ జాతరలో భాగంగా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బుధవారం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజయవాడకు చెందిన చిన్నారుల నృత ప్రదర్శన, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు.

నూకాంబిక సన్నిధిలో మావూరి


అమ్మవారిని దర్శించుకుంటున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారిని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను ఆయనకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.రాంబాబు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

16న దేవస్థానం భూముల బహిరంగ వేలం

రోలుగుంట : రోలుగుంట గ్రామానికి చెందిన శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం భూములకు ఈ నెల 16న కౌలు వేలం నిర్వహించనున్నారు. కొండపాలెం రెవెన్యూ సర్వే నంబరు 14లో ఎకరా 90 సెంట్లు (పల్లం), కంచుగుమల రెవిన్యూ 39/7, 200/1,200/3 సర్వే నంబర్లలో గల రెండెకరాల 80 సెంట్లు, పెదబొడ్డేపల్లి రెవిన్యూ 295 సర్వే నంబర్లో గల 31 సెంట్లు, అడ్డసరం రెవిన్యూ 79/8 సర్వే నంబరులో ఎకరా విస్తీర్ణంలో గల భూములకు 6, 3 ఏళ్ల కాలపరిమితికి కౌలుకు సంబంధించి దేవదాయశాఖ అధికారులు వేలం నిర్వహిస్తారు. ఆసక్తి గల రైతులు ధరావతు సొమ్ము చెల్లించి దేవస్థానం పేరున మూడు ఖాళీ చెక్కులు ఇవ్వాలని, వేలంపాటదారు ఆధార్ కాపీ ఇచ్చి పాటలో పాల్గొనాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 630309838 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


జి.భీమవరంలో ప్రకృతి వ్యవసాయ ఘన, ద్రవ జీవామృతాల తయారీని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రాంతీయ అధికారి ప్రకాష్


సుందరయ్యపేటలో ప్రకృతి వ్యవసాయ నాణ్యత కషాయాలు, ద్రావణాల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కశింకోట: ప్రకృతి వ్యవసాయ విధానంలో 9 జాతులకు చెందిన నవ ధాన్యాల విత్తనాలు నాటుకొని సాగు చేయడం ద్వారా భూమి సారవంతం కావడమే కాకుండా రైతులు అదనపు ఆదాయం కూడా పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం ప్రాంతీయ అధికారి కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని జి.భీమవరంలో 50 మంది రైతు మాస్టర్ ట్రైనర్లు, నోడల్ అధికారులకు ప్రకృతి వ్యవసాయం సాగుపై క్షేత్ర స్థాయిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు 12 కిలోల నవ ధాన్యాల విత్తనాలు నాటుకోవాలన్నారు. దీని వల్ల భూమి సారవంతంగా, ఆరోగ్యకరంగా తయారు అవుతుందన్నారు. మొక్కలను పచ్చి రొట్ట ఎరువుగా వినియోగించుకోవచ్చునన్నారు. వాటి ద్వారా వచ్చే ఫల సాయం విక్రయించుకోవడం వల్ల అదనంగా ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం నాణ్యమైన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం సుందరయ్యపేట గ్రామంలో మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న ప్రకృతి వ్యవసాయ కషాయాలు, ద్రావణాల గురించి, వాటి తయారీ విధానాన్ని ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రాంతీయ అధికారి జి.హేమసుందర్, సీనియర్ అసోసియేట్లు కుంజా అనంతరాం, నీలిమ, మోడల్ మేకర్ కాయల దేవి, ప్రకృతి వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ, ఎల్-1 ద్వారపురెడ్డి రమణ, ఎల్-2 ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బకాయిల కోసం ఉపాధి కూలీల నిరసన


ఎన్ నర్సాపురం వద్ద కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న కూలీలు, రైతు సంఘ నాయకులు

నక్కపల్లి: మండుటెండలో ఉపాధి పనులకు వెళ్తున్న తమకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పలువురు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎన్.నర్సాపురంలో పనులు చేసే చోట కూలీలంతా నిరసన వ్యక్తం చేశారు. పథకం కింద ప్రతి రోజు పనుల్లోకి వెళ్తున్నామని, వేతనాలు మాత్రం నెలల తరబడి చెల్లించడం లేదని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఏమీ లేకపోవడంతో ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో పూడిక తీత, గట్లు పటిష్టం, పంట కాలువల నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేస్తున్నామన్నారు. నాలుగైదు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని చెల్లించడం లేదని లబ్ధిదారులు ఆరోపించారు. మండలంలో 33 పంచాయతీల్లో సుమారు 8 వేల మందికి పైగా జాబ్‌కార్డు కలిగిన వారు ఉన్నారు. ప్రతి గ్రామంలోను ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఉదయం ఆరు గంటల నుంచే కూలీలు పనులకు హాజరవుతున్నారు. రోజుకు వేతనం రూ.307 గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పిస్తున్నట్టు అధికారులు చెబుతున్నప్పటికీ.. ఆ స్థాయిలో వేతనాలు రావడంతో లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. రూ.150లకు మించి వేతనం అందడం లేదని చెబుతున్నారు. కూలీలకు వేతనాలు చెల్లించని విషయం తెలుసుకున్న జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్ మనబాల రాజేష్ నర్సాపురంలో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు మద్దతుగా ఆందోళన చేశారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.80 కోట్ల మేర ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని చేసిన 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి కూలీల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఎన్నికల ముందు ఇస్తామన్న రైతు భరోసా, అమ్మఒడి వంటి పథకాలు సైతం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనులకు వేతనాలను సకాలంలో చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని నిలదీశారు. బకాయి వేతనాలు చెల్లించకపోతే త్వరలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బ్రిడ్జి కోర్సుతో సత్ఫలితాలు


పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు, లెక్చరర్లు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎ.ఆర్.టి.సుజాత తెలిపారు. బ్రిడ్జి కోర్సుకు హాజరవుతున్న విద్యార్థులకు బుధవారం పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వేసవి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ఇందుకు మంచి స్పందన వస్తోందన్నారు. మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వివిధ గ్రూపుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందిస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేట్ కళాశాలల మోజులో పడి డబ్బులు పోగొట్టుకోవద్దని, ప్రభుత్వ కళాశాలలో ఉచితంగానే విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలి

క్రైస్తవ సంఘాలు నిరసన ప్రదర్శన


చోడవరం కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం చేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

చోడవరం : పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలని కోరుతూ చోడవరం నియోజకవర్గం క్రైస్తవ సంఘాలు బుధవారం నిరసన ర్యాలీ చేశారు. నియోజకవర్గంలో అన్ని క్రైస్తవ సంఘాలు మూకుమ్మడిగా ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. చోడవరం మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ చేసి కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం చేశారు. క్రైస్తవులపై దాడులుచేస్తే సహించేది లేదని, పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా న్యాయవిచారణ జరపాలని, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై మతోన్మాద శక్తులు దాడులకు పాల్పడుతున్నాయని, వాటిని అరికట్టాలని తమను కాపాడాలని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతిని హత్యగా క్రైస్తవ సంఘాలు భావిస్తున్నాయని, ఆ దిశగా దర్యాప్తు చేస్తే నిజాలు బయటకు వస్తాయని సంఘ ప్రతినిధులు నోవహు, భూషణం, ఎం. హోసన్నా అన్నారు. ఈ ఆందోళనలో యేసుపాదం, యేసురాజన్, బి.రవికుమార్, ఎస్.అజయ్‌ప్రసాద్, కృపాశేఖర్, జై ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త రకం వంగడాల సాగుపై సర్వే


వమ్మవరం గ్రామంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

ఎస్.రాయవరం: రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అన్నారు. వమ్మవరం గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. ఇప్పటికే ఏర్పాటైన రైతు ఉత్పాదక సంఘాల సభ్యులకు కొత్త రకం వంగడాలు సాగు చేసే ప్రక్రియపై సర్వే చేస్తున్నట్టు ఆమె చెప్పారు. కొబ్బరి సాగు ప్రాంతాల్లో అనుసంధాన ఉత్పత్తుల నుంచి చేపట్టే పనులపై రైతులతో చర్చించారు. అయితే అధికారులకు భిన్నంగా రైతులు సమాధానం చెప్పారు. గడిచిన ఐదారు నెలలుగా కొబ్బరికి తెల్లదోమ సోకి తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని, రైతులను ఆదుకునే ప్రక్రియ చేపట్టాలని పీడీకి రైతులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలవర్తి పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, మాజీ ఎంపీటీసీ పల్లేల జగ్గారావు, ఏపీఎం శివప్రసాద్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com